సాక్షి మంచిర్యాల

సోమవారం । 20 । మార్చి । 2023



ఏకరూపం.. ఆకర్షణీయం

మన ఊరు–మన బడితో పాఠశాలల రూపురేఖలను మార్చుతున్న ప్రభుత్వం..అదే తీరున విద్యార్థులకు అందించే దుస్తులకు సైతం కార్పొరేట్ లుక్ ఉండేలా చూస్తోంది. 8లో▸



అమ్మా, నాన్నలను ఆదుకోండి

రెక్కాడితే గాని డొక్కాడని వారి జీవితాల్లో క్యాన్సర్, పక్షవాతం శాపంగా మారింది. తల్లికి క్యాన్సర్, తండ్రికి పక్షవాతంతో కుటుంబ భారం పిల్లలపై పడింది. 10లో▸

గరిష్టం/కనిష్టం
31.3 /21.2

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరుగుతుంది. వాతావరణం చల్లగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

సత్యదేవున్ని దర్శించుకున్న కలెక్టర్



సత్యదేవున్ని దర్శించుకుంటున్న కలెక్టర్..

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామిని కలెక్టర్ సంతోష్, తన కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందించారు. స్వామి వారి శేషవస్త్రంతో సన్మానించారు.

ముందస్తు ఉగాది కవి సమ్మేళనం



అనంత వెంకటకృష్ణను సన్మానిస్తున్న కవులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక సరస్వతీ శిశుమందిర్‌లో సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం శ్రీశోభకృత్ నామ సంవత్సర ముందస్తు ఉగాది కవిసమ్మేళనం నిర్వహించారు. హైకోర్టు న్యాయవాది, ఆధ్యాత్మికవేత్త నారుమంచి అనంత వెంకటకృష్ణ ఉగాది విశేషాలు తెలియజేశారు. ఈసందర్భంగా 40 మంది కవులు పద్య, వచన, గేయంతో శోభకృత్‌ను స్వాగతించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు వామన్‌రావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కవులు, రచయితలు పట్వర్ధన్, రాజిరెడ్డి, భాగ్యలక్ష్మి, శ్రీలక్ష్మి, సుబ్బాయమ్మ పాల్గొన్నారు.

గంట వర్షానికే మునిగిన అండర్ బ్రిడ్జి



వర్షానికి బ్రిడ్జి కింద నీరు చేరిన దృశ్యం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో శనివారం రాత్రి గంటపాటు కురిసిన వర్షానికి రైల్వే అండర్ బ్రిడ్జి వరదనీటితో నిండిపోయింది. బ్రిడ్జి కింద నీరు నిలిచిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వాహనదారులు ఇబ్బంది పడ్డారు. రూ.3.90 కోట్లతో నిర్మించిన ఈ బ్రిడ్జి కేవలం వేసవిలో మాత్రమే పనిచేసేలా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. వరద నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముందుచూపు లేకనే..

పాతమంచిర్యాల: శనివారం రాత్రి కురిసిన వర్షానికి మునిగిన రైల్వే అండర్ బ్రిడ్జిని బీజేపీ నాయకులు ఆదివారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ ఎరబెల్లి మాట్లాడుతూ ముందుచూపు లేకుండా సరైన ప్రణాళికతో బ్రిడ్జి నిర్మించలేదని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే అసమర్థతతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదన్నారు. చిన్నపాటి వర్షానికే అండర్ బ్రిడ్జి నీట మునుగుతోందన్నారు. మంచిర్యాల టూటౌన్ ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, పాదచారుల కోసం రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట వంగపల్లి వెంకటేశ్వర్ రావు, బోయిని హరికృష్ణ, పూదరి రమేశ్, ఆకుల సంతోష్, కుచాడి సతీశ్, సూరి రాజేశ్ తదితరులు ఉన్నారు.

అకాల వర్షం.. అతలాకుతలం

- జిల్లాలో 18.7 మిల్లీమీటర్ల వర్షపాతం
- కోటపల్లి, నస్పూర్, నెన్నెలలో అధికం
- వరి, మామిడి, మొక్కజొన్న, మిర్చి పంటలకు నష్టం
- నెలవాలిన వృక్షాలు.. నిలిచిన విద్యుత్ సరఫరా



నెన్నెల మండలంలో నేలరాలిన మామిడి కాయలు



వేమనపల్లిలో కొట్టుకుపోయిన రోడ్డు

మంచిర్యాల అగ్రికల్చర్: ఉపరితల ద్రోణి ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు కురిసిన అకాల వర్షానికి జనజీవనం అతలాకుతలమైంది. పంటలు దెబ్బతిన్నాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. జిల్లా వ్యాప్తంగా 18.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కోటపల్లి, నస్పూర్, నెన్నెల మండలాల్లో అధికంగా 30 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, లక్సెట్టిపేట, భీమిని, తాండూర్, కన్నెపల్లి మండలాల్లో 10 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అకాల వర్షం, ఈదురుగాలులకు మామిడి పంటకు తీవ్ర నష్టం జరిగింది. నెన్నెల, భీమారం, జైపూర్, చెన్నూర్, కోటపల్లి మండలాల్లో మామిడి, మిర్చి మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. పొట్ట గొలక దశలో ఉన్న వరి పంట నెలవాలింది. దీంతోపాటు ధర పెరుగుతుందని నెలల తరబడి ఇళ్లలో నిల్వ ఉంచుకున్న పత్తి తడిసి పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అర్ధరాత్రి కురిసిన వర్షానికి పత్తిపై కవర్లు కప్పుకునేందుకు రైతులు ఇబ్బంది పడ్డారు. ఉరుములు, మెరుపులతో వర్షం, గాలిదుమారం రావడంతో పలు ప్రాంతాల్లో చెట్లు పడిపోయాయి. విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు పడిపోవడంతో పలు గ్రామాల్లో, పట్టణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచింది. జిల్లా కేంద్రంలో 33 కేవీ విద్యుత్ తీగ తెగిపోవడంతో సరఫరాకు అంతరాయం కలిగింది. గంటల తరబడి కరెంటు నిలిచిపోవడంతో ఆసుపత్రుల తోపాటు వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

307 ఎకరాల్లో పంట నష్టం..

అకాల వర్షానికి జిల్లాలో 170 ఎకరాల్లో వరి, 136 ఎకరాల్లో మొక్కజొన్న, ఎకరంలో నువ్వు పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. వందల ఎకరాల్లో ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయి. మామిడి, జీడిమామిడి, మిర్చి, ఇతర కూరగాయల పంటలకు నష్టం వాటిల్లింది. క్షేత్ర స్థాయిలో పరిశీలన చేపడితే దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, వీస్తున్న ఈదురు గాలులకు మామిడి కాయలు నేలరాలుతున్నాయి. ఉద్యానవన శాఖ అధికారులు మాత్రం జిల్లాలో ఇప్పటి వరకు ఎలాంటి నష్టం వాటిల్లినట్లు తెలియడం లేదని పేర్కొంటున్నారు.

జిల్లాలో నమోదైన వర్షపాతం..

కోటపల్లి 36.9 మి.మీలు, నస్పూర్ 35.5 మి.మీలు, నెన్నెల 31.8 మి.మీలు, మందమర్రి 29.5 మి.మీలు, భీమారం 28.3 మి.మీలు, చెన్నూర్ 25.3 మి.మీలు, వేమనపల్లి 25.8 మి.మీలు, మంచిర్యాల 26.4 మి.మీలు, జైపూర్ 23.1 మి.మీలు, హాజీపూర్ 11.1 మి.మీలు, జన్నారం 11.9 మీ.మీలు, దండేపల్లి 15.5 మి.మీలు, కన్నెపల్లి 8.8 మి.మీలు, లక్సెట్టిపేట 5.2 మి.మీలు, తాండూర్ 6.1 మి.మీలు, భీమారం 6 మి.మీలు, బెల్లంపల్లి 3.8 మి.మీల వర్షపాతం నమోదైంది.

పెద్దగా నష్టం జరగలేదు..

జిల్లాలో అకాల వర్షాలతో ఉద్యానవన పంటలకు పెద్దగా నష్టం జరిగినట్లు మాదృష్టికి రాలేదు. రైతులు వర్షాలతో పంట నష్టం వాటిల్లినట్లు తెలుపలేదు. ఎవరైన మా దృష్టికి తీసుకువస్తే పరిశీలిస్తాం.

– ఉదయ్‌కుమార్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి

మిర్చి రైతుకు అకాల నష్టం



చెన్నూర్‌లో వర్షానికి తడిసిన మిర్చి పంట

చెన్నూర్: అకాల వర్షంతో జిల్లాలో మిర్చి పంటకు తీవ్ర నష్టం జరిగింది. చేతికి వచ్చిన పంటను రైతులు చేలల్లోనే ఆరబెట్టారు. చెడగొట్టు వర్షాలు మిర్చి పంటను నీట ముంచాయి. శనివారం రాత్రి కురిసిన వర్షానికి చెన్నూర్ పట్టణంలో సుమారు 500 క్వింటాళ్ల మిర్చి నీటి పాలైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన మిర్చిని ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



వేమనపల్లిలో తడిసిన మిర్చి చూపుతున్న రైతు

గిరిజన బాలికలు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

- గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయ ఓఎస్‌డీ సుధాకర్



న్యూట్రిషన్ కిట్‌లు పంపిణీచేస్తున్న సుధాకర్

పాతమంచిర్యాల/లక్సెట్టిపేట: సైకిల్‌పోలో క్రీడల్లో గిరిజన బాలికలు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయ ఓఎస్ డీ సుధాకర్ అన్నారు. సైకిల్‌పోలో జాతీయ పోటీల్లో జిల్లా విద్యార్థులు కాంస్య పతకం సాధించడం అభినందనీయమన్నారు. పదో తరగతి బో, దన పర్యవేక్షణలో భాగంగా జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమపాఠశాలను, లక్సెట్టిపేట గిరి జన బాలికల ఆశ్రమ పాఠశాలను ఆదివారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి గిరిజన సంక్షేమశాఖ అదనపు వసతులు, ప్రత్యేక ఆహారం, స్టడీ మెటీరియల్, అకాడమిక్ కిట్లు, శానిటేషన్ కిట్లు, న్యూట్రిషియన్ కిట్లు అంది స్తుందని వివరించారు. 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ ప్రత్యేక నగదు బహుమతిని అందిస్తారని తెలిపారు. విద్యార్థుల కోరిక మేరకు పాఠశాలలో సైకిల్‌పోలో సమ్మర్ క్యాంప్ నిర్వహించేలా కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమాల్లో జిల్లా గిరిజన క్రీడల అధికారి బండ జీవరత్నం, హెచ్ఎం గఫార్, వార్డెన్ శోభారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'షీ' వాహనాలెక్కడ?



రామగుండం పోలీస్ కమిషనరేట్‌కు 2016 నవంబర్‌లో వచ్చిన షీ టీమ్ ద్విచక్ర వాహనాలు(ఫైల్)

- 2016లో కమిషనరేట్‌కు 20 స్కూటీలు మంజూరు
- మంచిర్యాలకు 5 కేటాయింపు
- రెండేళ్లుగా కనిపించని వెహికిల్స్

మంచిర్యాలక్రైం: మహిళల భద్రత, వారిపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు పోలీస్‌శాఖ షీ టీమ్ వింగ్‌ను 2014 అక్టోబర్, 24న ప్రయోగాత్మకంగా హైదరాబాద్‌లో ప్రారంభించారు. ఏడాదిలో మంచి ఫలితాలు రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా షీటీమ్‌లు ఏర్పాటు చేశారు. 2015, అక్టోబర్ 31న ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో షీ టీమ్‌లు ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా షీటీమ్‌లపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో మహిళలు, యువతులపై వేధింపులు, అఘాయిత్యాలు తగ్గాయి. దీంతో షీ టీమ్‌లను మరింత బలోపేతం చేసేందుకు సిబ్బందికి ద్విచక్రవాహనాలు(హోండా యాక్టివా)అందజేసింది. ఏదైనా ఘటన జరిగినప్పుడు, ఎక్కడి నుంచైనా ఫోన్ వచ్చినప్పుడు వేగంగా ఘటన స్థలానికి వెళ్లేందుకు ఇవి ఉపయోగపడతాయని తెలిపింది. ఇందులో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్‌కు 2016, నవంబర్‌లో 20 ద్విచక్రవాహనాలు, రెండు స్పై కెమెరాలను(పెన్ కెమెరా) కేటాయించింది. వాటిలో మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌కు ఐదు స్కూటీలు, ఒక స్పై కెమెరాను అందించారు. మూడేళ్ల వరకు ఈ వాహనాలపై సిబ్బంది విధులు నిర్వహించారు. షీటీమ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

కానరాని వాహనాలు..

జిల్లాలో షీటీమ్‌కు కేటాయించిన ద్విచక్రవాహనాలు రెండేళ్లుగా కనిపించడం లేదు. అవి ఎక్కడున్నాయో.. ఎవరు వాడుతున్నారో కూడా షీటీమ్ సిబ్బందికి కూడా తెలియకపోవడం గమనార్హం. జిల్లాలో షీటీమ్ ఏర్పాటైన కొత్తలో ఇన్‌చార్జిగా ఎస్సై సుమన రెడ్డి పనిచేశారు. అప్పుడు జిల్లా షీటీమ్ బృందానికి 5 వాహనాలు అందించారు. ఆమె బదిలీపై వెళ్లడంతో షీ టీమ్ కార్యకలాపాలు తగ్గుముఖం పట్టాయి. కొన్నాళ్లు ద్విచక్రవాహనాలను జిల్లా కేంద్రంలోని బృందాలు వినియోగించాయి. తర్వాత అవి కనుమరుగయ్యాయి. ఇప్పుడు పోలీస్ వాహనాల కోసం పోలీసులే గాలించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

సొంత వాహనాలపై గస్తీ..

జిల్లాలో 25 పోలీస్ స్టేషన్లు ఉండగా జిల్లా వ్యాప్తంగా షీటీమ్ ఇన్‌చార్జిగా ఒక ఎస్సై వ్యవహరిస్తుంటారు. షీటీమ్‌లో ఒక ఎస్సై, ముగ్గురు మహిళా కానిస్టేబుళ్లు, ఇద్దరు మెన్ కానిస్టేబుళ్లు ఉంటారు. ఈ బృందం అవసరాన్ని బట్టి జిల్లా మొత్తం సంచరిస్తుంది. వీరికి పోలీస్ శాఖ కేటాయించిన వాహనాలు లేకపోవడంతో సొంత వాహనాలపైనే వెళ్తున్నారు. కొన్ని సందర్భాల్లో వాహనం అందుబాటులో లేక సమాచారం అందిన వెంటనే ఘటన స్థలానికి చేరుకోలేకపోతున్నారు.



వాహనాలతో అప్పటి మంచిర్యాల షీటీమ్ ఇన్‌చార్జి ఎస్సైసుమన(ఫైల్)

వాహనాలుంటే ఉత్సాహంగా విధులు..

షీటీమ్స్‌కు వాహనాలు కేటాయించినప్పుడు పోలీసులు రెట్టింపు ఉత్సాహంతో పనిచేశారు. ప్రస్తుతం సిబ్బంది కొరత, వాహనాలు లేకపోవడంతో కార్యకలాపాలు తగ్గుతున్నాయి. ఫోన్ వచ్చినా వాహనాలు లేకపోవడంతో ఘటన స్థలానికి వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా షీటీమ్ వాహనాలు ఎక్కడున్నాయో పోలీసులకు అప్పగించాలని మహిళలు కోరుతున్నారు.

గిరిజనులను అడవికి దూరం చేసే కుట్ర



మాట్లాడుతున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

ఉట్నూర్: అడవులపై హక్కు పూర్తిగా ఆదివాసీ గిరిజనులదే అని, అయితే వారినే అడవి నుంచి దూరం చేసేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆరోపించారు. పోడు భూములకు హక్కు పత్రాలు ఇస్తామని ప్రకటించిన కేసీఆర్ సర్కార్ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. 'పీపుల్స్‌మార్చ్' యాత్ర నాలుగో రోజు ఉట్నూర్ మండలంలో కొనసాగింది. అంతకు ముందు ఎందా సమీపంలో టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీలపై రాష్ట్ర ప్రభుత్వ పాత్ర ఉందని ఆరోపిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోడు భూములకు హక్కు పత్రాలు ఇస్తామని ప్రకటించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సిగ్గు చేటన్నారు. గిరిజనుల సంక్షేమం కోసం ఉన్న ఐటీడీఏను ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. మిషన్ భగీరథ పథకంలో రూ.42వేల కోట్ల అవినీతి చోటు చేసుకుందని ఆరోపించారు. ఈ అక్రమాలపై చర్చకు రావాలని చాలెంజ్ విసిరారు. లిక్కర్ స్కాంలో భాగస్వామి అయిన కవితపై చట్టరీత్యా చర్యలు తీసుకునే ధైర్యం కేసీఆర్‌కు ఉందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ధరణిని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో రూ.18 లక్షల కోట్ల నిధులతో మిగులులో ఉన్న మనం ప్రస్తుతం రూ.5 లక్షల కోట్ల అప్పుల్లోకి వెళ్లామన్నారు. స్వరాష్ట్రంలో నీళ్లు లేవు..నిధులు లేవు..నియామకాలు లేవు..అని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే రేఖానాయక్ ప్రతీ పనికి కమీషన్ వసూలు చేస్తున్నట్లు ఆరోపించారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, వరంగల్ మాజీ మేయర్ స్వర్ణ, ఏఐసీసీ ప్రతినిధి వినోద్‌నాయక్, నాయకులు గంద్రత్ సుజాత, జెడ్పీటీసీ చారులత, ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రజినీరెడ్డి తదితరులున్నారు.

క్రమబద్ధీకరణకు మరో చాన్స్!

- జీవో 58, 59 దరఖాస్తులకు గడువు పెంపు
- సింగరేణి స్థలాలకు జీవో 76 ప్రకారం దరఖాస్తులు
- ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు స్వీకరణ

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో నిర్మించుకున్న ఇళ్ల క్రమబద్ధీకరణకు 58, 59 జీవోల కింద దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చింది. సింగరేణి స్థలాలను ఆక్రమించి నిర్మించిన ఇళ్ల క్రమబద్ధీకరణకు జీవో 76 ప్రకారం దరఖాస్తులు స్వీకరిస్తుంది. ఈ మేరకు ఈనెల 17న ఉత్తర్వులు విడుదల చేసింది. 58, 59 జీవోలకు సంబంధించి ఏప్రిల్ 1 నుంచి 30 వరకు దరఖాస్తులు స్వీకరించనుండగా.. జీవో 76 కింద దరఖాస్తుల స్వీకరణకు ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు మూడు నెలల పాటు అవకాశం కల్పించింది. దీంతోపాటు గతేడాది ఇదే జీవోల కింద 2014, జూన్ 2 నాటికి ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్న వారికి అవకాశం కల్పించగా తాజాగా కటాఫ్ తేదీని కూడా 2020, జూన్ 2వ తేదీ వరకు పెంచింది.

సింగరేణి స్థలాల్లో నిర్మాణాలకు

ఇప్పటికే సింగరేణి స్థలాలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన శ్రీరాంపూర్, క్యాతనపల్లి, మందమర్రి, బెల్లంపల్లి ప్రాంతాల్లో ఇప్పటికే ఇళ్ల పట్టాలు అందజేశారు. మరోమారు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ జీవో 76ను విడుదల చేసింది. ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏళ్ల తరబడి సింగరేణి కార్మికులు ఉద్యోగరీత్యా దూర ప్రాంతాల నుంచి వచ్చి స్థానికంగా శాశ్వత ఇళ్లు నిర్మించుకున్నారు. కార్మికేతరులు సైతం వృత్తిరీత్యా, ఇతర వ్యాపారాలు చేసుకుంటూ సింగరేణి ప్రాంతాల్లో భూములు ఆక్రమించుకుని నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. వ్యాపార సముదాయాలు సైతం నిర్మించుకున్నారు. గతంలో 2014, జూన్2 వరకు నిర్మించుకున్న ఇళ్లకు మాత్రమే క్రమబద్ధీకరణ అవకాశం కల్పించగా.. కొత్తగా 2020, జూన్ 2 వరకు ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టిన వారికి ఈ అవకాశం కల్పించింది.

తొలగిన అడ్డంకి..

పట్టణ ప్రాంతంతోపాటు గ్రామాల్లో సైతం ఇళ్ల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించడంతో ఏళ్లుగా రెగ్యులరైజేషన్ కోసం ఎదురు చూస్తున్నవారికి ప్రయోజనం కలుగనుంది. జీవో 58 ప్రకారం 125 గజాలలోపు ఉన్న స్థలాలను ఉచితంగానే ప్రభుత్వం క్రమబద్ధీకరిస్తుంది. జీవో 59 ప్రకారం 125 నుంచి 250 గజాలలోపు స్థలాలను మార్కెట్ ధర ప్రకారం స్లాబ్‌ల వారీగా ప్రభుత్వ కనీస ధరల్లో 50 శాతం ధరతో రెగ్యూలరైజ్ చేయనున్నారు. 250 నుంచి 500 గజాల స్థలం ఉన్న వాటికి 75 శాతం ధర, 500 నుంచి 1000 గజాల స్థలాల విస్తీర్ణంలో నిర్మాణాలు చేపట్టిన వాటికి పూర్తి ధర చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తుదారులు ఏదైనా గుర్తింపు కార్డు ఆధార్‌కార్డు, ఏదైన డ్యాకుమెంట్‌తోపాటు స్థలం తమ ఆధీనంలో ఉన్నట్లు నిరూపించే ఆస్తి పన్ను రశీదు, విద్యుత్ బిల్లు, తాగునీటి బిల్లు, రిజిస్టర్ డ్యాకుమెంట్లు వంటి వాటిలో ఏదైన ఒకటి జత చేయాల్సి ఉంటుంది. ఈ క్రమబద్ధీకరణకు రెవెన్యూ డివిజన్లలో ఆర్డీవోలు చైర్మన్లుగా, తహశీల్దార్లు కమిటీ సభ్యులుగా ఉంటారు. ఎలాంటి వివాదాలు లేని ప్రభుత్వ భూములు, ఎలాంటి అభ్యంతరాలు లేని స్థలాలను మాత్రమే క్రమబద్ధీకరిస్తారు.

ఈసారైనా మోక్షం కలిగేనా..

కొందరు నిరుపేదలు ఇళ్ల స్థలాల రెగ్యూలరైజేషన్ కోసం ప్రభుత్వ స్లాబ్ ప్రకారం లక్షల రూపాయలు డీడీలు చెల్లించారు. ప్రధానంగా కుంటలు, చెరువుల్లో, శిఖం, తదితర భూముల్లో నిర్మాణాలు చేసుకొని ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేనివారు రిజెక్టు జాబితాలో ఉన్నారు. రెగ్యూలజేషన్ కాకపోవడం చెల్లించిన నగదు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ సారైన అవకాశం వస్తుందని ఎదురు చూస్తున్నా..దీనిపై ఇంకా స్పష్టత లేదు.



గతంలో 3,636 దరఖాస్తులు..

గతేడాది భూముల క్రమబద్ధీకరణకు విడుదల చేసిన జీవో 58 (ఉచితంగా క్రమద్ధీకరణ), జీవో 59, (నామ మాత్రపు విలువతో) 2022, ఫిబ్రవరి 14న జీవో జారీ చేసింది. ఫిబ్రవరి 21 నుంచి మార్చి 31 వరకు దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలో 18 మండలాల నుంచి 40 రోజులు మీ సేవ కేంద్రాల్లో 3,636 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో నస్పూర్ నుంచే అధికంగా వచ్చాయి. మండలాల వారీగా వచ్చిన దరఖాస్తులు, క్షేత్రస్థాయిలో స్థలాల పరిశీలనకు 5 మందితో కూడిన నాలుగు ప్రత్యేక బృందాలు తనిఖీలు చేపట్టి ప్రత్యేక మొబైల్ యాప్‌లో నమోదు చేశారు. ఇందులో నస్పూర్ మండలంలో 1,306 దరఖాస్తులు రాగా.. అత్యల్పంగా వేమనపల్లి మండలంలో 28 దరఖాస్తులు వచ్చాయి. 58 జీవో కింద వచ్చిన దరఖాస్తుల్లో క్షేత్రస్థాయి పరిశీలనలో 80 శాతం తిరస్కరణకు గురయ్యాయి. 59 జీవో దరఖాస్తులు పరిశీలించినా క్రమబద్ధీకరణకు నోచుకోలేదు. దీంతో చాలామంది లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు



మందమర్రిలో కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం..

బెల్లంపల్లి: టీఎస్‌పీఎస్సీలో అవకతవకలు, ప్రశ్నపత్రం లీకేజీని నిరసిస్తూ బెల్లంపల్లిలో యూత్‌కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ శ్రేణులు ఆదివారం ఆందోళన చేశారు. రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఆదర్శ్‌వర్ధన్‌రాజు, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు ముడిమడుగుల మహేందర్ మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీలో ప్రశ్నపత్రాల లీకేజీలో లక్షలాది మంది నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ అసమర్థతతోనే పేపర్‌లీ కేజీ జరిగిందని విమర్శించారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం, ఐటీ మంత్రి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీ దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. నిరుద్యోగులకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా నిరుద్యోగుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ, యూత్‌కాంగ్రెస్ శ్రేణులు ఏల్పుల రోహిత్, ఎలుక ఆకాశ్, కొయ్యల రవియాదవ్, శివప్రసాద్, సాయికుమార్, రాజలింగు, భరత్, పవన్, వినయ్, షారూఖ్, బాలుయాదవ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం..

మందమర్రిరూరల్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీకి ముఖ్యమంత్రి కేసీఆర్ బాధ్యత వహించాలని, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని మేడారం వద్ద జాతీయ రహదారిపై కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఆందోళన చేశారు. మండల అధ్యక్షుడు జీవన్‌కుమార్ ఆధ్వర్యంలో కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆందోళనలో కాల్వ కుమార్, రామంచ రాములు, బద్ది రమేశ్, కొండపర్తి భగత్, భూనేని వేణు, సాయి, హనుమంతు, తిరుపతి, మైపాల్, రవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

అదుపు తప్పి కారు బోల్తా



ధ్వంసమైన కారు

భీమారం: మంచిర్యాల–చెన్నూరు జాతీయ రహదారిపై భీమారం కలప డిపో సమీపంలో శనివారం రాత్రి కారు అదుపు తప్పి పక్కనే ఉన్న కంకర కుప్పను ఢీకొని బోల్తా పడిందని ఏఎస్సై భూమన్న తెలిపారు. భీమారం గ్రామానికి చెందిన రంజిత్ కారు ప్రమాదానికి గురికాగా, ఆయనకు సల్ప గాయాలయ్యాయని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం

సిర్పూర్(టి): మండలంలోని హుడ్కిలి గ్రామానికి చెందిన చందన్‌ఖడె తేజస్ అనే యువకుడితో పాటు మరికొందరికి ఉద్యోగాలు ఇప్పిస్తానని ఓ వ్యక్తి మోసం చేశాడు. సిర్పూర్(టీ) ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. హుడ్కిలి గ్రామానికి చెందిన చందన్‌ఖడె తేజస్‌కు 8555005493 నంబర్ నుంచి కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి మిషన్ భగీరథలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికాడు. మండలంలోని 10 మంది యువకుల నుంచి రూ.4,500 చొప్పున మొత్తం రూ.49,500 గూగుల్‌పే, ఫోన్‌పే ద్వారా వసూలు చేసి మోసం చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

టవేరా చోరీ

జైనథ్: మండల కేంద్రానికి చెందిన ఉల్లాస్‌కు టవేరా వాహనం చోరీకి గురైంది. బాధితుడు, పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. ఉల్లాస్ ఈనెల 16న రాత్రి ఇంటి ఎదుట టవేరా వాహనం నిలిపాడు. ఉదయం లేచి చూడగానే కనిపించ లేదు. రెండు రోజుల పాటు వాహనం కోసం గాలించాడు. అచూకీ దొరకక పోవడంతో చోరీకి గురైంది భావించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఆదివారం కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యంషాపులో దొంగతనం

కాసిపేట: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దనపల్లి మద్యం షాపులో శనివారం రాత్రి చోరీ జరిగింది. స్వీపర్ యశోద ఆదివారం ఉదయం ఊడ్చేందుకు వెళ్లగా తాళం పగిలిఉండడాన్ని గమనించి మద్య షాపు ఓనర్‌కు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. రెండు సీసీ కెమెరాలు ధ్వంసం చేశారని, సుమారు రూ.20వేల విలువైన మద్యం బాటిళ్లు, రూ.20వేల నగదు, రూ.18విలువైన సెల్‌ఫోన్ చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. ఈ మేరకు సోమగూడెం పోలీస్‌స్టేషన్‌లో చల్ల చిన్నయ్య ఆదివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగారాం తెలిపారు.

ఎడ్లబండి పైనుంచి పడి ఒకరు మృతి

ఆసిఫాబాద్‌రూరల్: ఎడ్లబండి పైనుంచి కింద పడి ఒకరు మృతి చెందారు. ఎస్సై గంగన్న తెలిపిన వివరాల ప్రకారం.. మాలన్‌గొంది గ్రామానికి చెందిన సిడెం మారు(46) అంకుసాపూర్ సర్పంచ్ బలరాం ఇంట్లో పాలేరుగా పని చేస్తున్నాడు. ఉదయం ఇంటి నుంచి అడవికి కట్టెల కోసం ఎడ్లబండిపై వెళ్తుండగా కోసార గ్రామ శివారులో ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. మారుకు భార్య, నలుగురు పిల్లలున్నారు. భార్య అన్నిబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏకరూపం.. ఆకర్షణీయం

- స్కూల్ యూనిఫాం డిజైన్ మార్చిన విద్యాశాఖ
- వేసవి సెలవుల్లోనే కుట్టించేలా చర్యలు
- పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులకు అందుబాటులోకి..

మంచిర్యాలఅర్బన్: మన ఊరు–మన బడితో పాఠశాలల రూపురేఖలను మార్చుతున్న ప్రభుత్వం ..అదే తీరున విద్యార్థులకు అందించే దుస్తులకు సైతం కార్పొరేట్ లుక్ ఉండేలా చూస్తోంది. సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులకు అందించే యూనిఫాం 2023–24 సంవత్సరానికి గాను జాప్యం కాకుండా ముందుస్తు చర్యలు చేపట్టింది. ఇప్పటికే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా లెక్కలు తీసి అవసరమైన ముడి వస్త్రం ఆర్డర్ ఇచ్చింది. ఈ నెలాఖరు వరకు జిల్లాలకు నూతన ముడి వస్త్రం వచ్చేలా చర్యలు చేపడుతోంది. గతేడాది యూనిఫాం పంపిణీలో జాప్యం కారణంగా పంద్రాగస్టుకు కూడా పాత దుస్తులే ధరించాల్సి వచ్చింది. ఈనేపథ్యంలో నూతన విద్యాసంవత్సరం పాఠశాలల ప్రారంభం నుంచే యూనిఫాం అందించేలా ప్రణాళికలు రూపొందించింది. ముడి వస్త్రం జిల్లాకు చేరగానే సెలవుల్లోనే దర్జీ వద్దకు చేర్చి అక్కడి నుంచి పాఠశాల పునఃప్రారంభం నాటికి విద్యార్థులకు అందించాలని సర్కారు ఏర్పాట్లు చేస్తోంది.

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 3, 481 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 2,18,853 మంది విద్యనభ్యసిస్తున్నారు. వీరందరికీ వచ్చే విద్యా సంవత్సరం పాఠశాలల పునఃప్రారంభం నాటికి రెండు జతల యూనిఫాం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అవసరమైన ముడివస్త్రం టెస్కో నుంచి 10,80,447 మీటర్లు ఉమ్మడి జిల్లాకు సరఫరా చేయనుంది. మొదట నేరుగా ఎమ్మార్సీలకు అక్కడి నుంచి పాఠశాల స్థాయికి చేర్చనున్నారు. హైస్కూళ్లలో హెచ్‌ఎంలకే దుస్తులు కుట్టించే బాధ్యతలు అప్పగించారు. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు యూనిఫాం కుట్టించే బాధ్యతను కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు అప్పగించారు. ఏమాత్రం జాప్యం జరుగకుండా వేసవి సెలవులు ముగిసే నాటికి యూనిఫాం స్టిచ్చింగ్ పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటారు.



మార్చిన డిజైన్లు ఇవే

సరికొత్తగా యూనిఫాం..

వచ్చే విద్యాసంవత్సరం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాం సరికొత్తగా డిజైన్ చేశారు. రంగు మార్చకుండా డిజైన్ మాత్రమే మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు విధి విధానాలు రూపొందించారు. 1 నుంచి 3వ తరగతి బాలికలకు బాడీఫ్రాక్‌లు, రైట్‌సైడ్ లోపలికి ఒకపాకెట్, ఎదురు కుచ్చిళ్లు, 2 ఇంచులు పట్టితో కుట్టనున్నారు. బాడీ ఫ్రాక్‌కు కింద షర్టుక్లాత్‌తో 2 ఇంచులు వెడల్పు పట్టి, బెల్ట్ రింగులు సూటింగ్ క్లాత్‌తో కుట్టనున్నారు. షర్టుకు చేతులకు పట్టీలు, క్లిప్‌లు, షూటింగ్ క్లాత్‌తో వేయాల్సి ఉంది. క్లిప్ పొడువు 3 ఇంచులు, వెడల్పు ఇంచుతో యూనిఫాం డిజైన్ రూపొందించారు. ఇక 4, 5 తరగతుల బాలికలకు స్కర్ట్, కుచ్చిళ్లు పెట్టి కుట్టాల్సి ఉంటుంది. చొక్కాకు రెండు జేబులు కుట్టడం, చొక్కా మధ్యలో షూటింగ్ క్లాత్‌తో పట్టి, బుజాలపైన క్లాపులు, రెండు చేతులకు క్లిప్పులతో దుస్తులు(హ్యాండ్ లూప్స్) తీర్చిదిద్దనున్నారు. 6 నుంచి 12వ తరగతి వరకు బాలికలకు పంజాబీ డ్రెస్ డిజైన్ చేశారు. టాప్, రెండు చేతులకు క్లిప్‌లు, ముందు భాగాన యు ఆకారంలో వాస్కోటు తదితర మార్పులు చేశారు. 1 నుంచి 12వ తరగతి వరకు బాలురుకు షర్టుకు రెండు జేబులు, పట్టీలు, చేతులకు క్లిప్‌లు, భుజాలకు క్లాపులు గుండీతో పెట్టి కుట్టాల్సి ఉంటుంది. గతంలో మాదిరిగానే నిక్కర్, ప్యాంట్ అందించనున్నారు.

జిల్లాల వారీగా పాఠశాలలు, విద్యార్థులు, అవసరమయ్యే వస్త్రం వివరాలు..

జిల్లా	పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య	కావాల్సిన వస్త్రం(మీటర్లలో)
మంచిర్యాల	805	45,309	2,32,750
ఆదిలాబాద్	1,194	73,582	3,40,567
నిర్మల్	735	54,227	2,67,055
ఆసిఫాబాద్	747	46,735	2,40,075

పాఠశాలలు తెరిచే నాటికి..

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠశాలలు తెరిచేనాటికి యూనిఫాం అందించేందుకు చర్యలు చేపట్టాం. యూనిపాంల డిజైన్ మార్చుతూ విధివిధానాలు ఖరారయ్యాయి. ఈనెలాఖారు వరకు జిల్లాకు టెస్కో ద్వారా ముడి వస్త్రం ఎమ్మార్సీలకు చేరుతుంది. అక్కడి నుంచి పాఠశాలలకు పంపిణీ చేస్తాం. పాఠశాలలు పునఃప్రారంభం నాటికే దుస్తులు అందిస్తాం.

– వెంకటేశ్వర్లు, డీఈవో, మంచిర్యాల

అపూర్వం.. ఆత్మీయం



1988-89 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

భీమారం/రామకృష్ణాపూర్: మూడు, నాలుగు దశాబ్దాల క్రితం కలిసి చదువుకున్న విద్యార్థులంతా ఆదివారం ఒక్కచోట కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. మతకు విద్యాబుద్ధులు నేర్పి తమ ఎదుగుదలకు దోహదం చేసిన గురువులను సన్మానించారు. ఇందుకు భీమారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, రామకృష్ణాపూర్‌లోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల వేదికైంది. భీమారం జెడ్పీ పాఠశాలలో 1981–82 పదో తరగతి చదివిన విద్యార్థులు పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 42 సంవత్సరాల అనంతరం ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనడం సంతోషంగా ఉందని పూర్వవిద్యార్థులు పేర్కొన్నారు. గరువులు పద్మాకర్‌రావు, దిగంబర్‌రావు, ప్రభాకర్‌రావు, సారంగపాణి, రాంరెడ్డి, శంకరయ్య, రాజలింగంను సన్మానించారు. రామకృష్ణాపూర్ పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1988–89 బ్యాచ్ పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం ఆనందంగా సాగింది. క్యాతనపల్లిలోని ఎంఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన సమ్మేళనంలో సుమారు 60 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. 35 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో వారు ఆనందంలో మునిగిపోయారు. చిన్ననాటి అనుభూతులు, జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా గడిపారు. పూర్వ విద్యార్థి నల్లాల మురళి ఆధ్వర్యంలో సమ్మేళనం నిర్వహించారు.



భీమారంలో జరిగిన పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న అప్పటి ఉపాధ్యాయులు, విద్యార్థులు

రెండు బైకులు ఢీకొని నలుగురికి గాయాలు

బెల్లంపల్లిరూరల్: రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొని నలుగురు యువకులు గాయపడిన ఘటన బెల్లంపల్లి మండలంలో చోటుచేసుకుంది. తాళ్లగురిజాల పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. దహెగాం మండలం గిరివెల్లి గ్రామానికి చెందిన ఆర్.నవీన్, సీహెచ్ సాయి తమ ద్విచక్రవాహనంపై ఆదివారం రాత్రి గిరివెల్లి నుంచి బెల్లంపల్లికి వస్తున్నారు. కన్నెపల్లి మండలం పోలంపల్లికి చెందిన కె.ఫరీద్, సికినం గ్రామానికి చెందిన కె.వేణు బెల్లంపల్లి నుంచి కన్నెపల్లికి వెళ్తున్నారు. ఈ క్రమంలో వీరి వాహనాలు బెల్లంపల్లి మండలం చెర్లపల్లి గ్రామ సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో నవీన్, సాయిలు తీవ్రంగా గాయపడగా, ఫరీద్, వేణులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న తాళ్లగురిజాల ఏఎస్సై రాజన్న, కానిస్టేబుల్ మహేందర్, సిబ్బంది జమీల్ అక్కడికి చేరుకుని గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం మంచిర్యాలకు తరలించారు. ఈ మేరకు తాళ్లగురిజాల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



గాయాలతో సాయి

గేట్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న వర్సిటీ డైరెక్టర్ సతీష్‌కుమార్

భైంసా(ముధోల్): గేట్–2023 ఫలితాల్లో బాసర ఆర్జీయూకేటీ విద్యార్థులు ఆల్‌ఇండియా స్థాయిలో ర్యాంకులు సాధించారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన చైతన్య 293వ ర్యాంకు, మణిప్రసాద్ 912వ ర్యాంకు, జగదీశ్ 234వ ర్యాంకు, శివకుమార్ 563వ ర్యాంకు సాధించారు. ఆదివారం వర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సతీష్ కుమార్ విద్యార్థులను అభినందించారు. ఈసీఈ శాఖాధిపతి కార్తీక్, అధ్యాపకులు ధీరజ్, ప్రణయ, తేజస్విని, నీలిమ, పాల్గొన్నారు.

సమ్మేళనం పేరుతో సొమ్ములు స్వాహా

- పూర్వ విద్యార్థుల ఆవేదన
- నిర్వాహకులపై మండిపాటు
- పోలీసులకు ఫిర్యాదు

శ్రీరాంపూర్: పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం పేరుతో లక్షల్లో డబ్బులు వసూలు చేసి తప్పుడు లెక్కలు చూపి, తమ సొమ్ములు స్వాహా చేశారని సింగరేణి కాలరీస్ హైస్కూల్ అలుమిని అసోసియేషన్ నాయకులు తెలిపారు. సీసీసీలోని సింగరేణి స్కూల్ వద్ద ఆదివారం అన్ని బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థులు, అసోసియేషన్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి రవి శంకర్, ఉపాధ్యక్షులు పీ.రాజబాబు రెడ్డి, పప్పు శ్రీనివాస్ మాట్లాడుతూ ఫిబ్రవరి 12న ఇక్కడ పాఠశాల వద్ద 1986–2022ల టెన్త్ బ్యాచ్‌లతో పూర్వ విద్యార్థుల మహాసమ్మేళనం నిర్వహించినట్లు తెలిపారు. తమతో పాటు చదువుకున్న ఒకరు ఈ కార్యక్రమం చేద్దామని ముందుగా ప్రతిపాదన పెట్టి నమ్మించడంతో, కార్యక్రమాన్ని నిర్వహించే బాధ్యత అతడి చేతుల్లో పెట్టినట్లు తెలిపారు. అతడు మరో ముగ్గురిని కలుపుకొని సంయుక్తంగా ఒక బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసి డబ్బులు అందులో జమ చేసుకున్నారన్నారు. పెద్దయెత్తున కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పడంతో అన్ని బ్యాచ్‌ల విద్యార్థులు స్వచ్ఛందంగా కొంత బ్యాంక్ అకౌంట్‌కు, మరికొంత నగదు రూపంలో విరాళాలు ఇచ్చారు. ఇలా మొత్తం సుమారు రూ.40లక్షల వరకు జమ అయ్యాయన్నారు. ఇంత పెద్దయెత్తున డబ్బులు వసూలు చేసిన కూడా కార్యక్రమానికి హాజరైన వారికి సరైన తిండి పెట్టలేదని, ఒంటెద్దు పోకడలతో అందరిని కలుపుకోకుండా కార్యక్రమం చేయడం వల్ల పూర్తిస్థాయిలో విజయవంతం కాలేదన్నారు. చివరికి తప్పుడు లెక్కలు చూపి ఫండ్‌ను దిగమింగారని ఆరోపించారు. కార్యక్రమానికి ఎంత ఖర్చు అయ్యిందో చెప్పమంటే సరైన లెక్కలు చూపకుండా అడిగితే బెదిరిస్తున్నారన్నారు. తప్పుడు లెక్కలతో కొన్ని లక్షల రూపాయలు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. స్కూల్ పేరుతో ట్రస్ట్ ఓపెన్ చేసి తాము చదువుకు, పాఠశాలకు ఏదైనా చేయుతనందిస్తారనుకుంటే మొత్తం డబ్బులను స్వాహా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఈ నలుగురిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తాము సీసీసీ నస్పూర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో దాసరి ప్రభాకర్, చంద్రిక, భాగ్యలక్ష్మి, చంద్రశేఖర్, జాఫర్, అనిల్‌కుమార్, భూపతి శ్రీనివాస్, బొద్దున రమేశ్, సలీం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సింగరేణి స్కూల్ పూర్వ విద్యార్థులు

ఆటో బోల్తా.. ఒకరు మృతి

భైంసాటౌన్(ముధోల్): పట్టణంలోని సాత్‌పూల్ వంతెన సమీపంలో ఆటో బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందినట్లు పట్టణ సీఐ ఎల్ శ్రీను తెలిపారు. మహారాష్ట్రలోని భోకర్ తాలూకా బేంద్రి గ్రామానికి చెందిన గడేకర్ గణపత్(60) శనివారం రాత్రి ఆటోలో భైంసాలోని బంధువుల ఇంటికి వస్తుండగా భైంసాలోని సాత్‌పూల్ వద్ద ఆటో బోల్తా పడడంతో తీవ్రగాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ భైంసాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు నాందేడ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని భైంసాలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఒకరి మృతి

నార్నూర్: మండలంలోని పూసిగూడ ఘాట్ వద్ద బైక్ అదుపు తప్పి కింద పడడంతో ఒకరు మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. సీఐ ప్రేంకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కుమురం భీం జిల్లా లింగాపూర మండలంలోని పిట్టగూడ గ్రామానికి చెందిన సోయం శ్రీనివాస్ (28) బైక్‌పై నార్నూర్ మండలంలోని పూసిగూడ గ్రామంలో తన బంధువు పెళ్లికి వచ్చి తిరుగు ప్రయాణంలో పూసిగూడ ఘాట్ వద్ద బైక్ అదుపు తప్పింది. బైక్ అతడిపై పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మృతుడి తమ్ముడు సోయం రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

వాంకిడి: పేకాడుతూ పట్టుబడిన తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై డీ సాగర్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. మండల కేంద్రంలోని ఇంద్రానగర్ కాలనీ లోగల పేకాట స్థావరంపై ఎస్సై తన సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. పేకాడుతున్న తొమ్మిదిమందిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.23,600 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అదిలాబాద్ రూరల్: మండలంలోని అర్లి(బి) శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై నాగనాథ్ తెలిపారు. అర్లి(బి) గ్రామానికి చెందిన నలుగురు, అడ, కంట గ్రామానికి చెందిన ఒ కరు చొప్పున ఉన్నారు. వారి వద్ద నుంచి రూ.19,360 నగదు, 5 ఫోన్లు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నిర్మల్ విద్యార్థినికి గోల్డ్‌మెడల్



గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకుంటున్న సాహితి

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన సాహితి ముధుల్కర్ ఇంజినీరింగ్‌లో అత్యుత్తమ మార్కులు సాధించి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకుంది. గత విద్యా సంవత్సరం జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ ఇంజినీరింగ్‌లో అన్ని బ్రాంచ్‌లలో అత్యధిక మార్కులు సాధించింది. యూనివర్సిటీ 11వ స్నాతకోత్సవం శనివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ గోల్డ్ మెడల్, ప్రశంసపత్రం అందజేశారు. సదరు విద్యార్థినిని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భీమారావు, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పీజీ రెడ్డి, అధ్యాకులు రవికుమార్, శ్రీహరి, నర్సయ్య అభినందించారు.

గోదావరిలో దూకి వ్యక్తి ఆత్మహత్య



శ్రీనివాస్‌గౌడ్ (ఫైల్)

చెన్నూర్: పట్టణానికి చెందిన పబ్బా శ్రీనివాస్‌గౌడ్(49) అనే వ్యక్తి ఇందారం సమీపంలో గల గోదావరినదిలో దూకి ఆత్మహత్య చేసుకొని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం.. శ్రీనివాస్‌గౌడ్ కొంత కాలంగా మానసిక వేదనకు గురవుతున్నాడని, శనివారం ఇంట్లో నుంచి వెళ్లిన వ్యక్తి ఎంతకూ తిరిగి రాకపోవడంతో స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇందారం గ్రామ సమీపంలో గోదావరినదిలో ఆదివారం శ్రీనివాస్‌గౌడ్ మృతదేహం లభించింది. మృతదేహాన్ని పోలీసులు చెన్నూర్ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం చేయించారు. శ్రీనివాస్‌గౌడ్ భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వాసుదేవరావు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కల్వర్ట్‌లో కూరుకుపోయిన బోర్‌వెల్ వాహనం



మందమర్రిరూరల్: పట్టణంలోని రామన్ కాలనీ ఏరియాలో కూలిపోయిన కల్వర్ట్‌పై నుంచి వెళ్తున్న బోర్‌వెల్ వాహనం శనివారం రాత్రి కూరుకుపోయింది. దీంతో అటువైపుగా వెళ్లే ప్రజలకు ఇబ్బంది ఏర్పడింది. కల్వర్ట్ కూలిపోయిందని ఇదివరకు ఎన్నోసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా వెంటనే మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

పాముకాటుతో వృద్ధ మహిళ మృతి

మంచిర్యాలక్రైం: పాతమంచిర్యాలకు చెందిన బోయిన భూమక్క(70) పాము కాటుతో మృతి చెందినట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. భూమక్క భర్త ఉదయ్ 7సంవత్సరాల క్రితం, ఆమె కూతురు 3సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మరణించారు. అప్పటినుంచి భూమక్క ఒంటరిగా కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ నెల 12న ఇంటి సమీపంలో పాము కాటు వేయగా స్థానికులు గమనించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మూడు రోజుల చికిత్స అనంతరం, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించగా అక్కడ 4రోజులు చికిత్స అందించి, హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు తెలిపారు. స్థానిక వీఆర్‌ఏ ఎండీ నబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

- ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి
- మెనూ పాటించడం లేదని పీవోకు ఫిర్యాదు
- వార్డెన్‌ను తొలగించాలని ఆర్‌సీవోకు ఆదేశాలు



విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీస్తున్న ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి

నార్నూర్: విద్యార్థులు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి అన్నారు. మూడు రోజులుగా మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో శ్వాస సంబంధిత సమస్యతో బాధపడుతూ.. 15 మంది విద్యార్థినులు ఆస్పత్రి పాలవడంతో ఆదివారం పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. రిమ్స్ వైద్యులు నిర్వహించిన వైద్య శిబిరాన్ని పరిశీలించి, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం ఆర్‌సీవో గంగాధర్, ప్రిన్సిపాల్‌తో సమావేశమై ఘటన గురించి ఆరా తీశారు. మెనూ ఎందుకు పాటించడం లేదని ప్రశ్నించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వార్డెన్‌ను వెంటనే తొలగించాలని ఆర్‌సీవోను ఆదేశించారు. బయటకు వచ్చిన పీవోకు విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఆరు నెలలుగా విద్యార్థులకు గుడ్లు, పల్లిపట్టిలు ఇవ్వడం లేదన్నారు. మెనూ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పీవో మాట్లాడుతూ.. విద్యార్థులు మినరల్ నీరు తాగడంతో పాటు రక్తహీనత, న్యూట్రీషన్, కాల్షియం తక్కువగా ఉండడంతో శ్వాస సమస్యతో బాధపడుతున్నారని తెలిపారు. అందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి, పౌష్టికాహారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట పాఠశాల సిబ్బంది ఉన్నారు.